ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 336

పేజీలు : 5 వెల రూ. 2/-

శనివారం
18 ఏప్రిల్ 2026

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com


## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి



2 లో

## వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండియా కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం.. వివరాలు 2లో



# మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

- ఉత్తర దక్షిణ పేరుతో విభజన సరికాదు
- ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు
- మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు
- డీలిమిటేషన్‌తో ఎస్సీ, ఎస్టీ సీట్లు పెరుగతాయి
- వారి సీట్ల పెపును అడ్డుకోవడం సరికాదు
- లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా

2 లో



## సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

- కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సీఎం
- మరోమారు మండిపడ్డ హరీష్ రావు

2 లో



## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సీఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2 లో



## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

- ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో - కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత
- ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తాం..




2 లో

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

- హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు



2 లో

# రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఏకైక కులం మాదిగలు

**– కుల గణన నివేదిక ఆధారంగానే మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలి**

**– డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ**



ఏ ఎం న్యూస్ ఓయూ:

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఏకైక కులం మాదిగలు అంటూ మంద కృష్ణ మాదిగ చేస్తున్న ప్రకటన సత్యమని కుల గణన రిపోర్ట్ రుజువు చేసిందని ఎమ్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదికలో మాదిగల జనాభా 10.3 % గా తేలిందని దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎమ్ఎస్ఎఫ్ ఆద్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సోమశేఖర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగలు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చే సమయంలోనే 9% రిజర్వేషన్ వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ఈరోజు వరకు పోరాడు తున్నాడని చెప్పారు. ఇప్పుడు వచ్చిన కుల గణన రిపోర్ట్ ద్వారా మాదిగల జనాభా శాతం గణంకాలతో సహా బుజువైందని అన్నారు. ఇప్పుడైనా రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు తెచ్చుకొని న్యాయం చేయాలను కోరారు. మంద కృష్ణ మాదిగ జనాభా ప్రకారం మాదిగలకు 11% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే. ముఖ్యమంత్రి మెప్పు కోసం కొంత మంది జాతి ద్రోహులు మాదిగ మేధావుల ముసుగులో 9% రిజర్వేషన్లను స్వాగతించి తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఓయూ లో పిహెచ్డి అడ్మిషన్ల భర్తీ ప్రక్రియలో సీటు మ్యాట్రిక్స్ విధానంతో మాదిగ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్న నోరు మెదపని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జాతి ద్రోహులని అన్నారు. రేవంత్ రెడ్డి ఇలాంటి ద్రోహులను ప్రోత్సహిస్తే తన రాజకీయ ఉనికికే ప్రమాదమని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ సీనియర్ నాయకులు వీరపాకుల పరుశరామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో కార్నర్ మీటింగ్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



తమిళనాడు రాష్ట్రంలోని మేలూరు నియోజకవర్గ పరిధిలోని కొట్టాగుడి,అరసప్పన్ పట్టి, పానగాడి, అయ్యనార్ పురం, ఆడి బంటీ తిరువాదవూర్, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విశ్వనాథన్ కి మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్స్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. మెలూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విశ్వనాథన్ కి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ, 23వ తేదీన ( ఏప్రిల్ 2026)జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థి పి. విశ్వనాథన్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తారక్ డయాగ్నొస్టిక్ సెంటర్లో ఉచిత వైద్య శిబిరం

ఏ ఎం న్యూస్, యాదగిరిగుట్ట:





తుర్కపల్లి మండలం తుర్కపల్లి గ్రామంలో కళా తారక్ డయాగ్నొస్టిక్ సెంటర్ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు మరియు చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 137వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు తుర్కపల్లి గ్రామ మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా బిపి షుగర్ పరీక్షలు నిర్వహించి ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజకుమార్ మరియు దంత వైద్య నిపుణులు డాక్టర్ చావా అశ్లేష చే ఉచిత కన్సల్టేషన్ నిర్వహించారు. తదనంతరం డాక్టర్ సలహా మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఈ ఉచిత వైద్య శిబిరం నందు 100 మంది వరకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తారక్ దయాగ్నస్టిక్స సెంటర్ నిర్వాహకులు కొండల్ రెడ్డి మరియు పడిగం భానుశంకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాంప్ నిర్వాహకులు మాట్లాడుతూ తుర్కపల్లి గ్రామ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు వారి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల పెద్ద పెద్ద వ్యాధుల బారిన పడకుండా నివారించుకోవచ్చునని తరచుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ తుర్కపల్లి మరియు వైద్య సదుపాయాలు అందిస్తున్నందుకు తారక్ డయాగ్నొస్టిక్ సెంటర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు




## పార్లమెంటు సాక్షిగా ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలి: కందుల మధు

**తేజస్వి సూర్యకు పిండ ప్రధానం చేసిన తెలంగాణ జాగృతి నాయకులు**

ఏ ఎం న్యూస్, ఓయూ:



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ తో పోల్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ని వెంటనే పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని తెలంగాణ జాగృతి స్టేట్ సెక్రటరీ కందుల మధు, టీజేఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుమ్మడి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య వాఖ్యలను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద కందుల మధు, గుమ్మడి క్రాంతి కుమార్, సాయినేత, మంతెన మధు ఆధ్వర్యంలో పిండ ప్రధానం చేశారు. వారిని అడ్డుకున్న ఓయూ పోలీసులు అదుపులోకి తీసుకొని పీఎస్కు తరలించారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్లో డీలిమిటేషన్ పై చర్చ జరగకుండా పార్లమెంటును పక్క ద్రోవ పట్టించడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల విషం కక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలు, ఎంతో మంది అమరులై సాధించిన తెలంగాణ రాష్ట్రంపై అనుచిత వాక్యలు చేయడం సిగ్గు చేటన్నారు. తక్షణమే తేజస్వి సూర్య తెలంగాణ సమాజానికి పార్లమెంటు సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో భౌతిక దాడులు జరుగుతాయని హెచ్చరించారు.

## పెండింగ్లో ఉన్న ఉద్యోగుల పీఆర్సీ మరియు ఐదు డిఏలు హెల్త్ కార్డు, పాత పెన్షన్స్ స్కీము అమలు చేయాలని కోరుతూ ఓయూలో ఉద్యోగ సంఘాల నిరసన

ఏ ఎం న్యూస్ ఓయూ :




ఉస్మానియా యూనివర్సిటీ లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉస్మానియా యూనివర్సిటీ లోని నాలుగు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు బోజన విరామ సమయంలో ఓయూలోని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగులకు 51 శాతం ఫిట్మెంట్తో పాటు, తెలంగాణాలో పీఆర్సీ అమలు చేయాలన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి వారి కుటుంబాల ఇబ్బందులను తొలగించాలన్నారు. కొత్త ఈహెచ్ఎస్ స్కీం విధి విదానాలను వెంటనే రూపొందించి ఉద్యోగుల, పెన్సనర్లకు వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు కుమార్, జనరల్ సెక్రెటరీ ఉపేందర్ ఎన్జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ ఖాన్, జనరల్ సెక్రెటరీ బి వెంకటేష్, టెక్నికల్ స్టాఫ్ సోసియేషన్ అధ్యక్షుడు నాగరాజా రావు, జనరల్ సెక్రెటరీ అక్బర్ బెగ్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పవన్ కుమార్ , జనరల్ సెక్రెటరీ మొయిజోద్దీన్ అఫ్సర్, ఉద్యోగ సంఘాల నాయకులు యూసఫ్, బిక్షపతి రామాంజనేయులు. ఖలీల్, మల్లేష్ ఓ ఎస్. నర్సింగ్ రావు ఉద్యోగులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘానికి త్వరలో ఎన్నికలు

**– సంఘం వ్యవస్థాపకులు కుందారం గణేష్ చారి..**

**– విశ్వకర్మ భవన్లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్రస్థాయి సమావేశం..**

**హాజరైన రాష్ట్రస్థాయి ప్రతినిధులు..**



ఏ ఎం న్యూస్ ఓయూ:

విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘానికి త్వరలో ఎన్నికలు జరుగుతాయని సంఘం వ్యవస్థాపకులు కుందారం గణేష్ చారి తెలిపారు. సికింద్రాబాద్ లోని విశ్వకర్మ భవన్ లో వేదాస్ అసోసియేషన్, విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఐక్య సంఘం రాష్ట్ర ప్రతినిధులు వేదాస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం నిబంధనల ప్రకారం ఐదు సంవత్సరాల కాల పరిమితి పూర్తయినందున రాష్ట్ర కార్యవర్గ సభ్యుల కమిటీని ఎన్నికల ద్వారా మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. ఐక్య సంఘం మాజీ అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి అప్రజాస్వామికంగా ఎంపిక చేసుకున్న కార్యవర్గ సభ్యుల కమిటీ చెల్లదని తీర్మానం చేసుకున్నారు. త్వరలోనే ఐక్య సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రతినిధులతో చర్చించి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహించుకునేందుకు తేదీలను నిర్ణయం చేయాలని తీర్మానం చేయడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ ఒక లక్ష 15 వేల ఓట్లతో ఏర్పడిన ఐక్య సంఘం అన్ని సంఘాలని ఒకే తాటిపైకి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి ఎలక్షన్ కు వెళ్లాలని సూచించారు. సంఘంలో యువతకు కూడా అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుపుకొని అధ్యక్షున్ని ఎన్నుకునేందుకు వేదాస్ ముందుకు రావాలని సూచించారు. వేదాస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింగాజి సంతోష్ కుమార్ మాట్లాడుతూ జాతికి సేవ చేయడానికి నూతన నాయకత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలే జగన్నాథం మాట్లాడుతూ ఎర్రోజు బిక్షపతి ఐక్య సంఘాన్ని వసూళ్ల సంఘం గా మార్చి సంఘం పదవులను డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తిని సంఘం నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి నాగచారి మాట్లాడుతూ ఐక్య సంఘానికి త్వరలోనే అందరి సహకారంతో వేదాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించుకొని నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. సాయిలు చారి, జైన్ కుమార్, ముతోజు మధు చారి, అనంతోజు బ్రహ్మాచారి, వల్లబోజు నరసింహాచారి, తూముల నాగ చారి అక్కినపల్లి శ్రీనివాస్ చారి మాట్లాడుతూ వేదాస్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన సంఘం బైలా ప్రకారం ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికలకు వెళ్లాలని కోరారు. ఎవరైనా సరే పోటీ చేసి గెలిచి విశ్వకర్మ జాతికి ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రభుత్వ పథకాలను అందే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ ను జాతిపితగా ప్రభుత్వం ప్రకటించాలని ముక్తకంఠంతో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి పది జిల్లాల అధ్యక్షులు బ్రహ్మం, అశోక్ చారి, కమ్మరి మహేష్, శ్రీపాద నరేష్, బాలకృష్ణ, రాచపల్లి శ్రీధర్, మునిగంటి బ్రహ్మాచారి, తాటికొండ శ్రీనివాస్, కృష్ణ చారి, బిక్షపతి, కృపాకర్ చారి, సాంబ చారి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ మేడం.. వేలంపాట ఆపండి

**– పేస్-2లోని 1 నుండి 117 బ్లాక్ వాసుల విన్నపం**

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



6 /4 /2026 సంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీచేసిన వేలం నోటీస్ ఆధారంగా జరుపుతున్న వేలం పాటను ఆపాలని సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసిలో కలిసిన తెల్లాపూర్ పరిధిలోని కేసీఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఫేస్ 2 వాసులు(1 నుండి 117 లబ్ధిదారులు) అందరూ కలిసి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ మేడంని కోరారు. ఫేస్ టు ప్రధాన గేటు వద్ద ధర్నాకు దిగి గత ప్రభుత్వం పేద ప్రజల కోసం ఇచ్చిన డబల్ బెడ్ రూమ్ సముదాయంలోని వాణిజ్య దుకాణాలను ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగా అమ్ముకుంటుందని, మేము ఎలా బతకాలని, మాకు ఆధారం లేదని, చిన్నచితకా వ్యాపారాలు చేసుకుంటూ,మా కాలనీ లోనే మేము జీవిస్తామని బయట వారికి మీరు అవకాశం ఇవ్వవద్దని ధర్నాకు దిగి గట్టిగా నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఫేస్ టు వాసులు అందరూ ఐక్యతగా కలిసి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా దుకాణాల వేలంపాట జరిపించిన పిడి(హెచ్) చలపతిరావు, సహకరించిన అసిస్టెంట్ ఇంజనీర్ రాహుల్

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



సంగారెడ్డి జిల్లా కలెక్టర్/ ఈడి( హెచ్ ) నుంచి వచ్చిన ఉత్తర్వులను తూచా తప్పకుండా పాటించి కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1, 2 లలోని వాణిజ్య షాపులో విక్రయ వేలంపాట శుక్రవారం రామచంద్రాపురం ఎమ్మార్వో కార్యాలయం పక్కన గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఫేస్ 1,2 ల ఎవరైతే దుకాణాల కోసం డిడి కట్టారో వారికి ముందుగా టోకెన్ ఇచ్చి, దుకాణాల వేలం పాటలు పాల్గొనేటట్లు చేసి, ఎక్కువగా ఎవరైతే కోడ్ చేశారో వారికి వాణిజ్య సముదాయం ను అలాట్ చేశారు ప్రాజెక్ట్ డైరెక్టర్( పి డి )చలపతి. ఈ కార్యక్రమంలో ఫేస్ 1 అసిస్టెంట్ ఇంజనీర్ రాహుల్ పిడి చలపతి కి సహాయకారిగా ఉండి తన వంతు పాత్ర పోషించి ఈ కార్యక్రమం విజయవంతం కావడం లో లో పాలుపంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విరామం లేకుండా ఓపికగా వేలంపాటను కొనసాగించి ఇచ్చిన బాధ్యతను సక్రమంగా, పోలీస్ అధికారుల సమక్షంలో ప్రశాంతంగా నిర్వహించారు చలపతి. గురువారం(16/6/2026 జరిగిన వేలంపాట ను సక్రమంగా నిర్వర్తించి ఉన్నతాధికారుల మెప్పు పొందారు చలపతి.

## మీడియాకు ప్రకటన విడుదల చేసిన ఫేస్ 2 వాసి బానోత్ కోటేష్ (68 బ్లాక్) నాయక్

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



కొల్లూరు ఫేజ్-2లోని 2 బి హెచ్ కె డిగ్నిటీ హౌసెస్ లబ్ధిదారురాలు బానోత్ కావ్య తొ పాటు ఇతరులు, సదరు ప్రాజెక్టులో ఇతర సౌకర్యాల నిర్వహణ కోసం లీజుకు ఇచ్చిన మొత్తం 118 షాపులలో 83 షాపులను అన్యాక్రాంతం చేసే ప్రయత్నంలో, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ తేది 06/04/2026న జారీ చేసిన వేలం పాట నోటీసును సవాలు చేస్తూ, అడ్వకేట్ సి.హెచ్. జయకృష్ణ ద్వారా హైకోర్టులో డబల్యూ పి 12051/2026 నంబరు గల రిట్ పిటిషన్ను దాఖలు చేశారు. పిటిషనర్ల వాదనలు విన్న తర్వాత ఉమ్మడి సౌకర్యాలను ఎవరు నిర్వహిస్తారు, ఈ షాపులను అన్యాక్రాంతం చేయడానికి ప్రభుత్వానికి అధికారం ఎలా ఉంది అనే దానిపై సూచనలు కోరుతూ రెవెన్యూ ప్రభుత్వ ప్లీడర్ చేసిన అభ్యర్థన మేరకు, ఈ విషయాన్ని మోషన్ లిస్ట్లో సోమవారానికి వాయిదా వేశారు అని సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ పరిధిలోని కేసీఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఫేస్ 2 నివాసి, సీనియర్ నాయకులు, ప్రజల స్థానిక సమస్యల మేలు కోసం తపన పడే బానోత్ కోటేష్ నాయక్( 68 బ్లాక్ )ఒక ప్రకటన మీడియాకు శుక్రవారం విడుదల చేశారు.

## వేలం పాటలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు నరసింహ

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం రామచంద్రాపురం మండలం ఎమ్మార్వో కార్యాలయం పక్కనే ఉన్న గీత భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో హౌసింగ్ టు బి హెచ్ కాలనీ (కొల్లూరు డబల్ బెడ్ రూమ్ గా పిలవబడే ఫేస్ 1 లో) పిడి(హెచ్ ) సమక్షంలో వేలం పాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎవరైతే డిడి కట్టి టోకెన్ తీసుకున్నారు వాళ్లు వేలంపాటలో పాల్గొనాలి అని కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 40 వేల డీడిని కట్టి కొల్లూరు గ్రామస్తుడు, ప్రజలందరికీ మేలు చేసే, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహ వేలం పాటలో పాల్గొన్నారు.

## 3486000/ రూపాయలకు పేస్ 1లో దుకాణం సొంతం చేసుకున్న బోయినపల్లి రవికుమార్

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న హౌసింగ్ టూ(2) బి హెచ్ కే కాలనీ కొల్లూర్ లో ఉన్నఫేస్ 1( డబల్ బెడ్ రూమ్ గా పిలవబడి ఫేస్ 1)లో గల వాణిజ్య షాపుల వేలం వేయడానికి జిల్లా కలెక్టర్/ఈడి( హెచ్), సంగారెడ్డి నుండి ముందుగా 40 వేల రూపాయల డిడి ని జిల్లా కలెక్టర్ సంగారెడ్డి పేరు మీద కట్టాలని నోటిఫికేషన్ ఇచ్చిన విధంగా 40 వేల రూపాయలను డిడి కట్టి 17వ తారీకు (ఏప్రిల్ 2026) రోజున వారు చెప్పిన చిరునామా రామచంద్రపురం ఎమ్మార్వో కార్యాలయం పక్కన ఉన్న గీత భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లో శుక్రవారం జరిగిన దుకాణాల వేలంపాటలో పాల్గొని 415 చదరపు అడుగుల దుకాణం ను 230 టోకెన్ గల డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1, మూడవ బ్లాక్ 406 వాసి బోయినపల్లి రవికుమార్ 8400 రూపాయల ను బిడ్ చేసి అధికారులు చెప్పిన మూడవ బ్లాక్ షాప్ నెంబర్ 9 ని వేలంపాటలో 3486000( 34 లక్షల 86 వేలకు ) సొంతం చేసుకున్నారు. గతంలోకి వెళ్తే దైవభక్తి గల రవికుమార్ మూడో బ్లాక్లో గత సంవత్సరం(2025) ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద జరిగిన లడ్డు వేలం పాటలో లడ్డుని దక్కించుకొని గణేశుని ఆశీర్వాదం పొందారు.

# టీవీ చుట్టూ అల్లిన పల్లెటూరి కథ







టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం నేపథ్యంలో తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అద్దెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొట్టె). ఎప్పుడైతే ఆ ఇంట్లోకి టీవీ వచ్చిందో.. అప్పటి నుంచి ఊరి వాళ్ల బుల్లితెర వినోదాలకు రాజప్ప ఇల్లు చిరునామాగా మారిపోతుంది. ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదే రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా ఆ టీవీని ఎవరెత్తుకెళ్లారు? తనపై నింద తప్పని నిరూపించుకునేందుకు సతీష్ ఏం చేశాడు? ఊరి పెద్దలిచ్చిన రెండు వారాల గడువు లోపల ఆ టీవీని.. అసలు దొంగల్ని తను కనిపెట్టాడా? లేదా? ఈక్రమంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. ఇప్పుడు అరచేతిలోకి వినోదాలు వచ్చేశాక టీవీ ప్రాధాన్యం ఎవరికీ పెద్దగా తెలియట్లేదు కానీ.. 80-90ల తరానికి టీవీ అంటే ఓ ఎమోషన్. బుల్లితెరతో పెనవేసుకున్న అనుబంధాలు.. దాని చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు బోలెడన్ని. ఈ 'తిమ్మరాజుపల్లి టీవీ'తో ఆ జ్ఞాపకాల్ని.. ఆ అనుబంధాల్ని మరోసారి గుర్తు చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు మునిరాజ్. మలయాళ సినిమాల్లోలా చాలా సింపుల్ లైన్‌పై నడిచే చిత్రమిది. ఈ కథ ప్రధానంగా ఓ టీవీ దొంగతనం చుట్టూ తిరుగుతుంటుంది. సింగిల్ లైన్ కథలతో ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టడం అంత తేలికేం కాదు. కథలో బలమైన డ్రామా పండినప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో 'తిమ్మరాజుపల్లి టీవీ' పాసైంది. దర్శకుడు ఈ కథకి ఎలాంటి కమర్షియల్ హంగులు జోడించకుండా చాలా నిజాయితీగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ ఊరివాళ్ల మనస్తత్వాల్ని.. అక్కడి సంస్కృతి, సంప్రదాయాల్ని పరిచయం చేస్తూ కథని ఆరంభించిన తీరు బాగుంటుంది. నాయకానాయికల ప్రేమకథ ఎప్పుడైతే రాజప్పకి తెలుస్తుందో.. అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఇక తన ఇంట్లో టీవీ దొంగతనానికి గురైనప్పటి నుంచి కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తెరపై కనిపించేదంతా కొత్త వాలళ్లైనా ప్రేక్షకులకు అదెక్కడా ఇబ్బందిగా అనిపించదు. నాయకానాయికలతో పాటు తెరపై కనిపించే ప్రతి పాత్రా సహజమైన నటనతో గుర్తుండిపోతుంది. ఎల్లమ్మ పాత్రతో ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. దర్శకుడు తాను అనుకున్న కథని నిజాయితీగా చెప్పడంలో విజయం సాధించాడు. దీన్ని పూర్తిగా ఓ ప్లలెటూరిలోనే చాలా సహజంగా తెరకెక్కించారు. కిరణ్ అబ్బవరం నిర్మాతగా తొలి ప్రయత్నంలో చాలా తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదభరితమైన సినిమా చూపించగలిగారు. పాటలన్నీ కథలో భాగంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం సినిమాకి మంచి ఫీల్‌ని జోడించింది. విజువల్స్ ఆకర్షణగా నిలుస్తాయి.

## సంక్రాంతికి వస్తున్నాం.. నాకెంతో ప్రత్యేకం..




విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.

## చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు


### క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్



కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్టీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.


## Mana Cinemalu

## అల్లు అర్జున్ రాకాలో షారూఖ్ ఖాన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కలయికలో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్‌ఖాన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అట్లీ ఇప్ప టికే షారుఖ్‌తో 'జవాన్' వంటి భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అదే చొరవతో 'రాకా'లో ఒక కీలకమైన అతిథి పాత్ర కోసం షారుఖ్‌ను అడిగారని, అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. అల్లు అర్జున్ స్టైలిష్ యాక్షన్, అట్లీ టేకింగ్, దానికి తోడు షారుఖ్ ఖాన్ చరిష్మా తోడైతే ఈ చిత్రం గ్లోబల్ లెవల్‌లో రికార్డులు సృష్టించడం ఖాయ మని మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఈవిషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ మరో సినిమా



ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.